# నమస్తే తెలంగాణ
# జనగామ
5 | శనివారం 25 మే 2024 | JANAGAON




ప్రగతిసింగారం దారిలో ఎండిపోయిన హరితహారం చెట్లు



పట్టించుకునే వారు లేక విరిగిపోయిన రోడ్డు పక్కన నాటిన హరితహారం చెట్టు

- శాయంపేట మండలంలో కనరాని అవెన్యూ ప్లాంటేషన్
- సంరక్షణ లేక వేలాది హరిత హారం మొక్కలు మాయం
- పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యానికి నిదర్శనం

# ఎండిపోయి.. మట్టిలో కలిసిపోయి

శాయంపేట, మే 24 : హరితహారంలో భాగంగా గతంలో రోడ్ల వెంట నాటిన అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు ప్రస్తుతం మట్టిలో కలిసిపోయాయి. మండలంలోని కొన్ని పంచాయతీల కార్యదర్శులు, మండల అధికారుల పర్యవేక్షణ లేక వేలాది మొక్కలు ఆనవాళ్లు కోల్పోయాయి. ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో పెరిగిన చెట్లు పూర్తిగా ఎండిపోయాయి. కొన్నిచోట్ల మొక్కలను పశువులు తిన్నాయి. గత ప్రభుత్వంలో హరితహారంలో అవెన్యూ ప్లాంటేషన్‌ను అధికారులు పండుగ వాతావరణంలో రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటించారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు రోజూ కూలీ చెల్లించి మొక్కలకు రక్షణ చర్యలు తీసుకున్నారు. కానీ కొన్ని నెలలుగా ఆ మొక్కలను పట్టించుకున్న నాథుడే లేడని ప్రజలు ఆరోపిస్తున్నారు. పత్తిపాక నుంచి ప్రగతిసింగారానికి వెళ్లే దారిలో మొక్కలను నాటగా కొద్ది రోజులు సంరక్షించడంతో ఏపుగా పెరిగాయి. ఇప్పుడు చాలా మొక్కలు మట్టిలో కలిసిపోయాయి. నీళ్లు పోయకపోవడం, రక్షించే చర్యలు తీసుకోవడంలో కార్యదర్శి నిర్లక్ష్యం వహించడంతో ఎండిపోయాయి. సూరంపేట, నర్సింహులపల్లి, గట్లకానిపర్తి, గంగిరేణిగూడెం, సూర్యానాయక్‌తండా, పెద్దకోడెపాక తదితర గ్రామాల పరిధిలో అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు ఎండిపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. మైలారం నుంచి పెద్దకోడెపాక దారిలోని మొక్కలు అగ్నికి ఆహుతైనట్లు స్థానికులు చెప్పారు. అయితే ఈ పరిస్థితికి కార్యదర్శుల నిర్లక్ష్యమే కారణమని మొక్కలను పశువులు మేసినా పట్టించుకోలేదని ఎంపీడీవో ఫణిచంద్ర తెలిపారు. పోయిన చోట మళ్లీ మొక్కలు పెట్టించి, పశువుల యజమానులకు జీపీల ద్వారా నోటీసులు ఇప్పిస్తామని చెప్పారు.

# రైతులకు అందుబాటులో కొత్త వంగడాలు

**ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధన సంచాలకుడు రావుల ఉమారెడ్డి**

కాశీబుగ్గ, మే 24 : రైతుల కోసం అధిక దిగుబడిని ఇచ్చే చీడపీడలను తట్టుకునే నూతన వరి, కంది, పెసర పంటల వంగడాలు అందుబాటులో ఉన్నాయని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధన సంచాలకుడు రావుల ఉమారెడ్డి సూచించారు. శుక్రవారం పైడిపల్లిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో విత్తన మేళా సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలం పంటలకు పలు సూచనలు చేస్తూ పంట అవశేషాలను కాలపెట్టకుండా భూమిలోనే కలియదున్నాలని తెలిపారు. ప్రధాన శాస్త్రవేత్తలు, వెంకన్న, వీరన్న, సంధ్యకిశోర్ మాట్లాడుతూ వరిలో నేరుగా విత్తే పద్ధతి ద్వారా రైతులు సాగు ఖర్చు తగ్గించుకోవచ్చని, అలాగే పత్తి పంటలో అధిక సాంద్రత ద్వారా మంచి లాభాలు సాధించవచ్చని వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాళ్ మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాలను గుర్తింపు డీలర్ల దగ్గర మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. అనంతరం రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ దిలీప్‌కుమార్, హనుమకొండ ఏడీఏ దామోదర్‌రెడ్డి, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలు అందిస్తున్న అధికారులు

# వానకాలం.. వరి రకాలు

- అనువైన పంటలు సాగుచేసుకోవాలి
- రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన
- అందుబాటులో విత్తనాలు

కాశీబుగ్గ, మే 24 : వానకాలం సాగుకు సమయం దగ్గరపడుతోంది. దీంతో రైతులు వరి పంటలు వేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. అయితే, వరిలో కూడా పలు రకాల విత్తనాలు ఉంటాయి. ఈ క్రమంలో రైతులు సాగు చేసుకోవడానికి అనువైన వరి రకాలను ఎంచుకోవాల్సి ఉంటుంది. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో పలు రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

### స్వల్పకాలిక రకాలు

**డబ్ల్యూజీఎల్-1119 :** ఈ రకం పంట కాలం 115-120 రోజుల మధ్య ఉంటుంది. సన్న గింజ కలిగి ఉండి వివిధ రకాల ఉల్లికోడు బయోటైప్‌లను(1,2, 4ఎం) సమర్థవంతంగా తట్టుకుంటుంది. కొంత వరకు పొట్టకుళ్లు తెగులు, మెడ విరుపు తెగులును కూడా తట్టుకుంటుంది. ఒక ఎకరానికి 24 నుంచి 26 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.


**డబ్ల్యూజీఎల్-962 :** ఇది సాంబ మసూరికి(బీపీటీ5204) ప్రత్యామ్నాయ సన్నగింజ రకం. 120-125 రోజుల మధ్య పంట వస్తుంది. మధ్యస్థ ఎత్తు కలిగి ఉంటుంది. కొంత వరకు అగ్గి తెగులు, మెడ విరుపు తెగులును తట్టుకుంటుంది. మంచి గింజతో నాణ్యత కలిగి ఉంటుంది. ఒక ఎకరానికి 26-28 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది.

**డబ్ల్యూజీఎల్-1246 :** ఇది ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వరంగల్ నుంచి విడుదలకు సిద్ధంగా ఉన్న స్వల్పకాలిక (125-130 రోజులు), సన్న గింజ రకం. మెడ విరుపు తెగులు, సుడి దోమను కొంత వరకు తట్టుకుంటుంది. పొట్టకుళ్లు, కంకివల్లి, గింజ మచ్చ తెగులును సమర్థవంతంగా తట్టుకుంటుంది. మంచి గింజ, అన్నం నాణ్యత కలిగి ఉంటుంది. ఎకరానికి 28-30 క్వింటాళ్ల దిగుబడి వచ్చే సామర్థ్యం కలదు.

### మధ్యకాలిక రకాలు

**డబ్ల్యూజీఎల్-1487 :** ఈ రకాన్ని జీవ సాంకేతిక శాస్త్రం ద్వారా రూపొందించారు. దీని పంటకాలం 135 రోజులు. తక్కువ భాస్వరం లభ్యత కలిగిన నేలల్లో సాగు చేయడానికి అనుకూలమైన రకం. తక్కువ భాస్వరం కలిగిన నేలల్లో కూడా 26-28 క్వింటాళ్లు పండించవచ్చని పరిశోధనలో తేలింది. సుడిదోమ, అగ్గి తెగులును కొంత వరకు తట్టుకుంటుంది. మంచి నాణ్యత కలిగి ఉన్న సన్న గింజ రకం.

**డబ్ల్యూజీఎల్-915 :** ఇది వానకాలంలో సాగుకు అనుకూలమైన మధ్యకాలిక (135 రోజులు) దొడ్డు గింజ రకం. సుడిదోమ, అగ్గి తెగులుతోపాటు టుంగ్రో వైరస్ తెగులును కొంత వరకు తట్టుకుంటుంది. డ్రమ్ సీడర్ నేరుగా వెదజల్లే పద్ధతిలో సాగుకు అనువైన రకం. అటుకులు, మరమరాలు తయారీకి అనుకూలం. ఎకరాకు 30-32 క్వింటాళ్ల దిగుబడి సామర్థ్యం కలదు.



### దీర్ఘకాలిక రకాలు

**డబ్ల్యూజీఎల్-44(సిద్ధి) :** అధిక దిగుబడినిచ్చే (ఎకరానికి 28-30 క్వింటాళ్ల ) సామర్థ్యం కలిగి ఉన్న దీర్ఘకాలిక (140-145 రోజులు) సన్నగింజ రకం ఇది. ఉల్లికోడు (బయోటైప్-1)ను తట్టుకుంటుంది. కొంత వరకు చేడును కుడా తట్టుకుంటుంది. మంచి అన్నం, గింజ నాణ్యత కలిగి ఉంటుంది. ఎక్కువ ఎత్తు పెరిగి, చేను మీద పడిపోదు. బాగా దుబ్బు చేసే గుణం ఉంటుంది. సాంబ మసూరి కంటే ఎక్కువ దిగుబడి ఇస్తుంది. సాంబమసూరి కన్నా వారం రోజుల ముందే కోతకు వస్తుంది.

పైన తెలిపిన రకాల విత్తనాల కోసం రైతులు నేరుగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానానికి వచ్చి కొనుగోలు చేయవచ్చని వ్యవసాయ అధికారులు తెలిపారు. మరింత సమాచారం కోసం 9949317565 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# నేటి సాయంత్రం నుంచి ప్రచారం బంద్ : డీఆర్వో ప్రావీణ్య

ఖిలావరంగల్, మే 24 : పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా శనివారం సాయంత్రం 4 గంటల నుంచి ప్రచారాలు నిలిపేయాలని డీఆర్వో ప్రావీణ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు.. ఉపఎన్నిక ముగిసే 48 గంటల ముందు నుంచి పోటీల్లో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎలాంటి బల్క్ ఎస్ఎంఎస్‌లు సెండ్ చేయొద్దని తెలిపారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అభ్యర్థులు, ఆయా రాజకీయ పార్టీలు, మొబైల్ సర్వీస్ ప్రొవైడర్లు సైతం 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు ఎలాంటి ప్రచారాలు చేయొద్దని పేర్కొన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల కోసం ఎల్బీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఈ నెల 21 నుంచి శుక్రవారం వరకు 143 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నట్లు తెలిపారు.

**ఓటు హక్కును పరిశీలించుకోవాలి**

వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో ఓటు హక్కు నమోదు చేసుకున్న పట్టభద్రులు తమ ఓటు హక్కును పరిశీలించుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఓటర్లకు స్లిప్‌లు పంపిణీ చేశామని తెలిపారు. ఇంకా అందని వారు ఉంటే వెబ్‌సైట్‌లో తమ ఓటు హక్కును నిర్ధారించుకోవాలని పేర్కొన్నారు.

*చెరువు శిఖం కబ్జాలమయమైంది. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ పరిధిలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో వందలాది అక్రమ నిర్మాణాలు పుట్టుకొచ్చాయి. హద్దులు ఏర్పాటు చేసినా ఆనవాళ్లు సైతం కనిపించడం లేదు. ఈ క్రమంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నగరాల్లోని చెరువుల కబ్జాలు, వాటిలో నిర్మాణాలపై సర్వే చేయాలని ఆదేశించింది. దీంతో గ్రేటర్‌లోని ఆరు చెరువుల పరిధిలో అధికారులు సర్వే చేయగా అనేక ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి. ఈ మేరకు కొన్ని రోజుల క్రితం అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి సర్వే నివేదిక అందజేశారు. ఆ తర్వాత సర్కారు నిర్ణయం మేరకు చర్యలు తీసుకోనున్నారు.*

*- వరంగల్, మే 24*



# చెరువు శిఖం కబ్జాలమయం

## ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో వందలాది అక్రమ నిర్మాణాలు

- హద్దులు ఏర్పాటు చేసినా కనిపించని ఆనవాళ్లు
- గ్రేటర్‌లో ఆరు చెరువుల పరిధిలో సర్వే
- అనేక ఆసక్తికర విషయాలు వెలుగులోకి..
- ప్రభుత్వానికి నివేదిక పంపిన బల్దియా

చెరువుల పరిరక్షణపై బల్దియా దృష్టి సారించింది. రోజురోజుకూ విస్తరిస్తున్న నగరంతో పాటు చెరువులు కుదించుకుపోతున్నాయి. చెరువులకు ఆనుకొని అనేక నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఈ క్రమంలో గ్రేట ర్ వరంగల్‌లోని ఆరు చెరువుల పరిధిలో అధికారులు సర్వే నిర్వహించారు. ఇందులో అనేక విషయాలు వెలుగుచూశాయి. దశాబ్దాల క్రితం నగర పరిధిలోని చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లకు హద్దులను ఏర్పాటు చేసినప్పటికీ వాటి ఆనవాళ్లు ప్రస్తుతం లేకుండా పోయాయి. వందల సంఖ్యలో నిర్మాణాలు వెలిశాయి. కొన్ని చోట్ల గ్రేటర్ అధికారులు పర్మిషన్లు ఇవ్వడం చూసి సర్వేకు వెళ్లిన అధికారులు సైతం తెల్లమొహం వేసినట్లు సమాచారం. అయితే కొత్త ప్రభుత్వం సర్వే నివేదికపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని ఆసక్తి నెలకొంది.

**ఆరు చెరువుల పరిధిలో సర్వే**

గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలోని బంధం చెరువు, వడ్డేపల్లి చెరువు, భద్రకాళి చెరువు, కోటి చెరువు, చిన్న వడ్డేపల్లి చెరువు, రంగ సముద్రం(ఉర్సు చెరువు) చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, వాటి పరిధిలో చేపట్టిన నిర్మాణాలపై సర్వే చేశారు. నివేదికను కొన్ని రోజుల క్రితం అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి అందజే శారు. ఇప్పటికే చెరువు శిఖం పరిధిలో అనేక నిర్మాణాలు వెలిసినట్లు బల్దియాకు ఫిర్యాదులు వస్తున్నాయి. ముఖ్యంగా వడ్డేపల్లి, చిన్నవడ్డేపల్లి, బంధం, భద్రకాళి చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో వందల సంఖ్యలో నిర్మాణాలు వెలిసినట్లు సర్వేలో తేలినట్లు అధికారులు చెబుతున్నారు. చాలా నిర్మాణాలు అనుమతులు లేకుండానే చేశారని, వీటిపై ప్రభుత్వ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామంటున్నారు.

**కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం సర్వే**

కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిని ప్రామాణికంగా తీసుకొని సర్వే చేశారు. కొత్త మాస్టర్‌ప్లాన్‌లో వీటిని చూపించారు. సర్వే ఆధారంగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో చేపట్టిన నిర్మాణాలకు గ్రేటర్ అధికారులు నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే నోటీసుల జారీ ప్రక్రియను ప్రారంభించనున్నారు.



ఏటూరునాగారం : సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, పక్కన మాజీ మంత్రి సత్యవతి, తదితరులు

# కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధిచెప్పాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల ములుగు ఇన్‌చార్జి, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్
- ఏటూరునాగారం, మంగపేట మండలాల్లో సన్నాహక సమావేశాలు

ఏటూరునాగారం/ మంగపేట, మే 24 : ఆరు గ్యారెంటీలు, 420 మోసాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటుతో బుద్ధిచెప్పాలని ఎమ్మెల్సీ ఎన్నికల ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. ఏటూరునాగారం మండలకేంద్రం, మంగపేట మండలం రాజుపేట, తిమ్మంపేట, కమలాపురం గ్రామాల్లో పట్టభద్రులతో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, జడ్పీ చైర్‌పర్సన్, నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి హాజరయ్యారు. వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలు, పాలనను గాలికి వదిలి గాలి మోటర్‌పై ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నట్లు ఆరోపించారు. ఎమ్మెల్సీ ఉపఎన్నికలో ప్రతి పట్టభద్రుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమస్యలపై ప్రశ్నించే గొంతుక రాకేశ్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి తీన్మార్ మల్లన్నను బరిలో నిలిపి మరోసారి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నదన్నారు. ఈ సమావేశాల్లో ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు గడదాసు సునీల్‌కుమార్, కుడుముల లక్ష్మీనారాయణ, సుబ్బుల సమ్మయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ పోరిక గోవింద నాయక్, పట్టణ అధ్యక్షుడు ఎండీ ఖాజాపాషా, తుమ్మ మల్లారెడ్డి, కూనూరు అశోక్, సప్పిడి రాంనర్సయ్య, చిన్ని కృష్ణ, తూరం పద్మ, తాటి కృష్ణ, మంగపేట పీఏసీఎస్ చైర్మన్ తోట రమేశ్, జిల్లా నాయకులు కాకలమర్రి ప్రదీప్‌రావు, తాటి కృష్ణయ్య, చిలకమర్రి లక్ష్మయ్య, చిలకమర్రి రాజేందర్, చిట్టిమల్ల సమ్మయ్య, యడ్లపల్లి నర్సింహారావు, కర్రి శ్యాంబాబు, మలికంటి శంకర్, భూక్యా జంపన్న, గ్రామ కమిటీ అధ్యక్షుడు, ఎగ్గడి అర్జున్, చదలవాడ సాంబశివరావు, తుక్కాని శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ సిద్ధంశెట్టి లక్ష్మణ్‌రావు, తిరుపతి, బాలకృష్ణ, కర్రి శ్రీను, రాయ సాహెబ్, మధు ప్రసాద్, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి, గుడివాడ శ్రీహరి, పూజారి సతీశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలీసుల అత్యుత్సాహంపై ఎస్పీ సీరియస్!

- ఏటూరునాగారం, మంగపేట ఘటనలపై ఆగ్రహం
- ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించిన ఎస్పీ
- బాధితులతో రాజీకి అధికారపార్టీ నేతలతో అధికారుల మంతనాలు

ములుగు, మే 24 (నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లాలోని ఏటూరునాగారం, మంగపేట మండలాల్లో పోలీసులు వ్యవహరించిన తీరుపై జిల్లా పోలీస్‌బాస్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మంత్రి సీతక్క పర్యటన సందర్భంగా మొన్న మల్లూరులో పోలీసులు ఆటోల అద్దాలు పగులగొట్టడం, దళితుడిపై ఏటూరునాగారం ఎస్సై స్టేషన్‌కు పిలిపించి కొట్టిన ఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం తెలిసిందే.. ఈ రెండు ఘటనలు జిల్లా పోలీస్ శాఖకు మచ్చను తెచ్చిపెట్టాయి. అత్యుత్సాహం ప్రదర్శించి రెండు సంఘటనలకు కారకులైన పోలీస్ అధికారులపై ఎస్పీ సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. అంతేకాకుండా రాష్ట్ర స్థాయి పోలీస్ అధికారులు నిఘా వర్గాల నుంచి సమాచారం తెప్పించుకున్నట్లు తెలిసింది. ఎస్పీ ఆదేశాలతో ఏటూరునాగారం ఏఎస్పీ, ఇతర అధికారుల పర్యవేక్షణలో ఉన్నత స్థాయి విచారణ సైతం కొనసాగుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. మేడారం మహా జాతర నుంచి ఒక సంఘటన జరిగి దానిని ప్రజలు మరిచిపోయే లోపే మరో ఘటన జరుగుతుండడం వివాదాస్పదంగా మారుతూ వస్తున్నది. కాగా, గురువారం వెలుగులోకి వచ్చిన రెండు ఘటనల్లో బాధితులతో రాజీ కుదిర్చేందుకు అధికార పార్టీ నాయకుల ద్వారా సంబంధిత అధికారులు మంతనాలు జరుపుతున్నట్లు తెలిసింది.



మల్లూరు ఘాట్‌రోడ్డు పక్కన పడి ఉన్న ఆటోల అద్దాల ముక్కలు



# వికసించిన మే పుష్పం

శాయంపేట, మే 24: అరుదుగా కనిపించే మే పుష్పం హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని పెద్దకోడెపాకలో శుక్రవారం వికసించింది. గ్రామానికి చెందిన కొమనేని రఘు ఇంటి ఆవరణలో ఒకేసారి 63 పుష్పాలు వికసించాయి. వీటిని ఫుట్‌బాల్ లిల్లీ మొక్కలని (స్కోడక్సన్ మల్లి ఫోరస్) పిలుస్తారు. ఈ పుష్పాలు పింక్ కలర్, ఫుట్‌బాల్ ఆకారంలో ఉండడంతో చూపరులను అమితంగా ఆకర్షిస్తున్నాయి.



# కళాతోరణం
# చెరువుకు కొత్తందం

**భద్రకాళి బండ్‌పై ఏర్పాటు**

*భద్రకాళి బండ్‌పై కాకతీయ కళాతోరణం సిద్ధమైంది. చెరువు వద్ద అటు త్రివర్ణ పతాకం.. పక్కనే తోరణం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. బండ్ సుందరీకరణలో భాగంగా రామన్నపేట వద్ద ఏర్పాటుచేయగా అటుగా వెళ్లే ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. గతంలో కేసీఆర్ సర్కారు హయాంలో భద్రకాళి బండ్‌ను అత్యద్భుతంగా తీర్చిదిద్ది నగరవాసులకు అందుబాటులోకి తెచ్చింది. తాజాగా కళాతోరణం ఏర్పాటుతో భద్రకాళి చెరువుకు కొత్త శోభ వచ్చింది.* - స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నమస్తే తెలంగాణ